క్లుప్తంగా

జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడిగా శ్రీకాంత్



నూతన జిల్లా కబడ్డీ కమిటీని అభినందిస్తున్న పట్టణ నాయకులు

సామర్లకోట: కాకినాడ జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడిగా బడుగు శ్రీకాంత్ ఎన్నికయ్యారు. ఆదివారం స్థానిక సుగర్ ఫ్యాక్టరీ గెస్టు హౌస్‌లో నూతన కమిటీ ఎన్నిక నిర్వహించారు. ఎన్నికలో రాష్ట్ర కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడి జి.వెంకటరెడ్డి, ప్రధాన కార్యదర్శి ఎం.సుబ్బరాజు, కోశాధికారి ఎస్.అర్జునరావు, వర్కింగ్ ప్రెసిడెంట్ బి.సత్యనారాయణ ఆధ్వర్యంలో నూతన కమిటీ ఎన్నిక జరిగింది. అసోసియేషన్‌లో సామర్లకోటకు చెందిన వారికే ప్రాధాన్యత దక్కింది. వైస్ ప్రెసిడెంట్‌గా కొండపల్లి శ్రీను, కార్యదర్శిగా నిమ్మకాయల కిరణ్ ఎన్నికయ్యారు. నూతన కమిటీని మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ యార్లగడ్డ చిన్ని, వైఎస్సార్ సీపీ నాయకుడు గంగిరెడ్డి కృష్ణమూర్తి, కౌన్సిలర్ బలుసు వాసు, రైతు సంఘం అధ్యక్షుడు కంటే బాబు, ఆస్పత్రి అభివృద్ధి కమిటీ మాజీ చైర్మన్ అడబాల కుమారస్వామి తదితరులు అభినందించారు.

కరాటే పోటీలో సత్తా చాటిన సామర్లకోట విద్యార్థిని



కరాటేలో ద్వితీయ బహుమతి సాధించిన వర్షిత లక్ష్మీపద్మావతి

సామర్లకోట: చెన్నై నేషనల్ లెవెల్ చాంపియన్‌షిప్ 2024 కరాటే పోటీల్లో సామర్లకోట విశాలాక్షినగర్‌కు చెందిన వర్షిత లక్ష్మీపద్మావతి ద్వితీయ స్థానం సాధించింది. ఈ విషయాన్ని విద్యార్థిని తల్లిదండ్రులు శ్రీదేవి, సూర్య ఉదయ్‌భాస్కర్ తెలిపారు. వారు స్థానిక విలేకర్లతో ఫోన్‌లో మాట్లాడుతూ ఆదివారం జరిగిన ఈ పోటీల్లో తమ కుమార్తె ద్వితీయ స్థానం సాధించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. వర్షిత లక్ష్మీపద్మావతి స్థానిక భాష్యం స్కూల్‌లో ఆరో తరగతి చదువుతోందని చెప్పారు. కరాటేలో ప్రతిభ సాధించడానికి కోచ్ శంకర్ కారణమన్నారు. విద్యార్థినిని పెద్దాపురం ఆర్డీఓ జె.సీతారామరావు, జాతీయ పర్యావరణ మిత్ర అవార్డు గ్రహీత తోటకూర గంగాధర్, భాష్యం ప్రిన్సిపాల్ సూర్యారావు వర్షితను అభినందించారు.

కళాకారులకు సత్కారం



కళాకారులను సత్కరించిన భారతమాత సేవా పరిషత్ సభ్యులు

సామర్లకోట: అంతరించుకుపోతున్న కళలను ప్రోత్సహిస్తున్నట్టు భారత మాత సేవా పరిషత్ అధ్యక్షుడు గొరకపూడి చిన్నయ్యదొర అన్నారు. స్థానిక సంపెంగతోటలో ఆదివారం సాయంత్రం కళాకారులకు పాటల పోటీలు ఏర్పాటు చేసిన వారిని ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో సేవా సమితి సభ్యులు మూతిన రాంబాబు, ముప్పిడి బాబీ, మన్యం సూర్యారావు, మున్నీ, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా దీపోత్సవం



సామర్లకోట గణపతి శిబిరంలో దీపాలంకరణ

సామర్లకోట: స్థానిక 13వ వార్డు బలుసులపేట రామాలయంలో ఏర్పాటు చేసిన గణపతి శిబిరం వద్ద ఆదివారం రాత్రి దీపోత్సవం నిర్వహించారు. ఈ దీపాలంకరణ వార్డు కౌన్సిలర్ నేతల హరిబాబు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ నాయకులు పాల్గొన్నారు.



విగ్రహంతో పాటు గోదావరి కాలువలో దూకిన యువకుడు



గాదులదొడ్డిలో ఉన్న గణపతి మందిరం వద్ద దీపాలు వెలిగిస్తున్న భక్తులు



సాగర తీరంలో వినాయకుని నియజ్జనానికి తీసుకువెళ్తున్న మహిళలు



గణనాథుని తలపై పెట్టుకుని నిమజ్జనానికి తీసుకువస్తున్న భక్తులు

బైబై గణేశా..!

- ఊపందుకున్న గణపతి విగ్రహాల నిమజ్జనాలు
- ఘనంగా ఊరేగింపు
- సందడిగా మారిన గ్రామాలు

సామర్లకోట: గణపతి నవరాత్ర ఉత్సవాలు ముగియడంతో ఆదివారం నుంచి నిమజ్జనాలకు ఊపందుకున్నాయి. పట్టణ పరిధిలో గణపతి విగ్రహాలను నిమజ్జనం చేయడానికి స్థానిక పంచారామ క్షేత్ర ఆలయ ముఖద్వారం వద్ద ఉన్న రేవులో విగ్రహాలను నిమజ్జనం చేశారు. ఆయా గణపతి శిబిరాల నుంచి ఊరేగింపుగా నిమజ్జన ప్రదేశాలకు విగ్రహాలను తీసుకొని వచ్చారు. నిమజ్జనాల ప్రదేశంలో పోలీసు, రెవెన్యూ, మున్సిపల్ శాఖలకు చెందిన అధికారులు పర్యవేక్షణ చేయాల్సి ఉంది. అయితే మధ్యాహ్నం 12 గంటల సమయంలో ఎవరూ లేక పోవడం యువకులు గణపతి విగ్రహంతో పాటు గోదావరి కాలువలోనికి దూకారు. గోదావరి కాలువ నీటి మట్టం ఎక్కువగా ఉండడంతో కాలువ లోతు ఎక్కువగా ఉంది. దాంతో ఈత రాక పోతే ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నాయి. అర్ధరాత్రి వరకు పిష్పల ప్రకారం విధులు నిర్వహించాల్సిన సిబ్బంది విగ్రహాలు నిమజ్జనానికి వస్తున్న సమయంలో ఎవరూ లేక పోవడంపై అనేక విమర్శలకు దారి తీసింది. మూడు అడుగులకు మించి విగ్రహాలు వచ్చిన సమయంలో క్రేన్ ద్వారా నిమజ్జనం చేయాలి. ఆదివారం క్రేన్ ఏర్పాటు చేయలేదు. యువకులే విగ్రహాని నీటిలోనికి తీసుకెళ్లి నిమజ్జనం చేశారు. ఆ సమయంలో అదుపు తప్పితే ప్రమాదం జరిగే అవకాశాలు ఉన్నాయి. సోమవారం నుంచి నిమజ్జనాల జోరు మరింత పెరిగే అవకాశం ఉంది. దీనిని దృష్టిలో ఉంచుకొని అధికారుల పర్యవేక్షణ ఉండాలని స్థానికులు కోరుతున్నారు. మున్సిపాలిటీ, పీబీ దేవం, జి.మేడపాడు, వేట్లపాలెం, హుస్సేన్‌పురం గ్రామాలలో గోదావరి కాలువలో నిమజ్జనాలు జరిగాయి.



సామర్లకోట గోదావరి కాలువలో గణేశ్ విగ్రహాన్ని నిమజ్జనం చేస్తున్న యువకులు

ఘనంగా గణపతికి పూజలు

కొత్తపల్లి: గణపతి నవరాత్రులను భక్తులు భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. కొత్తపల్లి, వాకతిప్ప, ఉప్పాడ, కొమరగిరి, మూలపేట, కుతుకుడుమిల్లి శివారు నిదానందొడ్డిలో ఏర్పాటు చేసిన గణపతి మందిరల వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామంలో ప్రజలందరూ ఆయురారోగ్యాలతో ఉండాలని పంటలు సస్యశ్యామలంగా పండాలని గరిక పూజలు చేశారు. మండలంలో ఆలయ కమిటీలు, ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు జరిగాయి.

భారీ అన్నసమారాధన

కొత్తపల్లి: గణపతి నవరాత్రులను పురస్కరించుకుని స్థానికంగా ఉన్న జై గణేశా ఆలయం వద్ద ఆదివారం భారీ అన్నసమారాధన నిర్వహించారు. ఈ అన్నసమారాధన ఆలయ కమిటీ ఆధ్వర్యంలో జరిగింది. కొత్తపల్లి గ్రామం నుంచే కాకుండా కుతుకుడుమిల్లి, వాకతిప్ప, ఉప్పాడ తదితర గ్రామాల నుంచి సుమారు 4వేల మంది భక్తులు విచ్చేసి స్వామివారి అన్న ప్రసాదాన్ని స్వీకరించారు.

జోరుగా అన్నదాన కార్యక్రమాలు

సామర్లకోట: గణపతి నవరాత్రి ఉత్సవాలు ముగియడంతో పట్టణ, మండల పరిధిలో అన్నదాన కార్యక్రమాల జోరు పెరిగింది. ఈనెల ఏడో తేదిన గణపతి నవరాత్రి ఉత్సవాలను ప్రారంభించారు. ఈ మేరకు గణపతి ఆలయాలలోను, ఆయా ముఖ్యకూడలి ప్రదేశాలలోను, ఆటో, టాక్సీ స్టాండ్ల లోను గణపతి శిబిరాలను ఏర్పాటు చేసి 9 రోజుల పాటు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ మేరకు స్థానిక బళ్లమార్కెట్ సెంటర్‌లో ఉన్న గణపతి ఆలయంలో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప ప్రారంభించారు. ఆలయ కమిటీ నాయకులు తలారి అర్జునరావు, కారుకొండ వెంకటేశ్వరరావు, యంగ్రు రాము, కంచర్ల తాతాజీ, పెదిరెడ్డి పెదకాపు, కౌన్సిలర్ జట్ల మోహన్ పాల్గొన్నారు.



తీరంలో పుణ్యస్నానాలు ఆచరిసుతన్న భక్తులు



గణపతికి గరికితో అభిషేకం



సామర్లకోట గణపతి ఆలయం వద్ద అన్నదాన కార్యక్రమంలో ఎమ్మెల్యే రాజప్ప

ఘనంగా వినాయకుని నిమజ్జనాలు

- కళకళలాడిన సాగర తీరం
- పుణ్యస్నానాలు ఆచరించిన భక్తులు



సాగర తీరంలో వినాయకుని నిమజ్జనం చేస్తున్న భక్తులు

కొత్తపల్లి: మండలంలోని ఉప్పాడ, పొన్నాడ శివారు కొనపాపపేట, మూలపేట సాగరతీరం గణనాథుని నిమజ్జనాలతో ఆదివారం కళకళలాడింది. సుమారు 300లకు పైగా విగ్రహాలను సాగరంలో నిమజ్జనం చేశారు. వేలాది మంది భక్తులు పుణ్యస్నానాలను ఆచరించారు. ఉదయం నుంచి రాత్రి వరకు నిమజ్జనాలను జరిగాయి. మండలంలో ఇసుకపల్లి, యండపల్లి, కోనపాపపేట తదితర గ్రామాల్లో ఉన్న వినాయక విగ్రహాలను మేళతాళాలు, బాణసంచా కాల్పులతో గ్రామాలలో ఊరేగించారు. ఉప్పాడ సముద్రంలో మండలం నుంచే కాకుండా పిఠాపురం, గొల్లప్రోలు, సామర్లకోట, కిర్లంపూడి తదితర మండలాల్లోని వివిధ గ్రామాల నుంచి వందలాది విగ్రహాలను లారీలు, ట్రాక్టర్లు, ఆటోలపై వినాయకుని ప్రతిమలను ఊరేగింపుగా తీసుకొచ్చి సాగరతీరంలో నిమజ్జనం చేశారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసు కోకుండా పిఠాపురం సీఐ శ్రీనివాస్, ఎస్సై వెంకటేష్ ఆధ్వర్యంలో తన సిబ్బందితో బందోబస్తును నిర్వహించారు. ఉప్పాడ-కాకినాడ బీచ్ రోడ్డులో నిమజ్జన వాహనాలతో నిండిపోయింది.

వరద మిగిల్చిన బురద

- నీటిలో నానుతూ కుళ్లిన వరిపంట
- రైతుల కంట కన్నీరు
- కోతకు గురైన రోడ్లు



రాపర్తి వద్ద కుళ్లిన వరి పంట



కోతకు గురై ప్రమాదకరంగా ఉన్న రాపర్తి రోడ్డు

పిఠాపురం: ఏలేరు వరద కర్షకుడి కన్నీటిగా మారి చివరికి బురద మిగిల్చింది. వరద ప్రవాహానికి వరి పంట కొంత కొట్టుకుపోగా మిగిలింది బురదమయంగా మారి నాశనమైంది. దీంతో రైతుల కంటనీరు పెట్టుకున్నారు. పిఠాపురం నియోజకవర్గంలో వరద ప్రభావిత ప్రాంతాల్లో ఎక్కడ చూసినా వరి పంట పొలాలు దయనీయంగా దర్శనమిస్తున్నాయి. నాలుగు రోజుల పాటు నీటిలో ఉండిపోవడంతో వరి దుబ్బులు కుళ్లి పంట పొలాలు మురికి కూపాలుగా మారిపోయాయి. నియోజకవర్గంలో సుమారు 20 వేలకు పైగా ఎకరాల్లో వరి పంట పొలాలు ప్రస్తుతం బరదమయంగా మారి ఉన్నాయి. మరో పక్క ప్రదాన రహదారులు వరద తాకిడితో కోతకు గురై ప్రమాదకరంగా మారాయి.



జై గణేశ్ ఆలయంలో వంగా గీత పూజలు



వినాయకుడిని దర్శించుకుంటున్న వంగా గీత

పిఠాపురం: స్థానిక జై గణేశ్ ఆలయంలో కాకినాడ మాజీ ఎంపీ, వైఎస్సార్ సీపీ పిఠాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి వంగా గీత పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు ఆమెకు స్వాగతం పలికారు. ఆమె వినాయకుడిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకుడు ఆమెకు ఆశీర్వచనాలు స్వామి రి ప్రసాదాలు అందజేశారు. ఈకార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు బొజ్జా రామయ్య, రావుల మాదవరావు, ఉలవల భూషణం, కొత్తెం దత్తుడు, ముమ్మిడి శ్రీనివాసు, వజ్రపు బాబీ తదితరులు పాల్గొన్నారు.

వీకే రాయపురం విద్యార్థికి ప్రోత్సాహకం



నాగదుర్గశ్రీసాయికి ప్రోత్సాహకం అందజేసిన లయన్స్ విద్యా ప్రోత్సాహ ట్రస్టు సభ్యులు

సామర్లకోట: వీకే రాయపురానికి చెందిన ఎంబీబీఎస్ విద్యార్థిని తలారి నాగదుర్గ శ్రీసాయి లయన్స్ క్లబ్ నుంచి రూ.45వేలు ప్రోత్సహకం అందుకుంది. తూర్పుగోదావరి జిల్లా లయన్స్ సెంటిన్నియ్యల్ విద్యా ప్రోత్సాహ ట్రస్టు ఏటా పేద విద్యార్థులకు ఆర్థిక సాయం అందజేస్తోంది. దీనిలో భాగంగా 2024–25 విద్యా సంవత్సరానికి మెరిట్ విద్యార్థులకు కోనసీమ జిల్లా రామచంద్రపురం లయన్స్ క్లబ్‌లో 70 మంది విద్యార్థులకు ఆదివారం రూ.9.70లక్షలు స్కాలర్ షిప్ చెక్కులు, మరికొంత మందికి ల్యాబ్‌టాప్‌లను అందజేసినట్టు లయన్స్ క్లబ్ జిల్లా గవర్నర్ ఈదల ఈశ్వరకుమార్(సామర్లకోట), క్లబ్ సభ్యుడు తలారి దొరబాబు 'సాక్షి'కి తెలిపారు. అత్యుత్తమ ర్యాంకు సాధించి ఎంబీబీఎస్ మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థినికి రాబోయే నాలుగు సంవత్సరాలు కూడా మెరిట్ సాధిస్తే చదువు పూర్తి అయ్యే వరకు స్కాలర్ షిప్ ఇవ్వడానికి లయన్స్ క్లబ్ ప్రతినిధులు అంగీకరించారని దొరబాబు చెప్పారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు చైర్మన్ బీవీఎస్ రెడ్డి, ట్రస్టు గౌరవ అధ్యక్షుడు డాక్టరు బాదం బాలకృష్ణ, వైస్ చైర్మన్ తలారి రామచంద్రరావు, కార్యదర్శి పెదిరెడ్డి ఉమామహేశ్వరరావు, ఉపగవర్నరు, చిట్నీడి శ్రీనివాసు, మాజీ గవర్నర్లు లింగమల్లు కృష్ణమూర్తి, ఎం మంగతాయారు, పీఎస్ శర్మ, ఆర్వీ రమణారావు తదితరులు పాల్గొన్నారు.

కాండ్రకోట వెంకటేశ్వరరావు సిద్ధాంతి ఇకలేరు



సిద్ధాంతి మృతదేహానికి నివాళులర్పిస్తున్న దొరబాబు

పెద్దాపురం: కాండ్రకోట ఒబిలిశెట్టి వెంకటేశ్వరరావు సిద్ధాంతి(75) ఆదివారం మృతి చెందారు. నియోజకవర్గంలో మంచి పేరు ప్రఖ్యాతులు సాధించిన ఆయన ఇటీవల అనారోగ్యానికి గురై గుండె ఆపరేషన్ చేయించుకున్నారు. వైఎస్సార్ సీపీలో కీలక నేతగా వ్యవహరించిన సిద్ధాంతి మృతితో గ్రామంలో విషాద చాయలు అలుముకున్నాయి. ఈ విషయం తెలుసుకున్న వైఎస్సార్ సీపీ పెద్దాపురం నియోజకవర్గ కో-ఆర్డినేటర్ దవులూరి దొరబాబు, జెడ్పీటీసీ గవరసాని సూరిబాబు, నాయకులు ఆయన అంత్యక్రియల్లో పాల్గొని, మృతికి సంతాపం వ్యక్తం చేశారు. కటుంబ సభ్యులకు ప్రగఢ సానుభూతిని తెలియజేసి ఆయన మృతి పార్టీకి తీరనిలోటన్నారు. సంతాపం వ్యక్తం చేసిన వారిలో గంటా రామస్వామి, చిక్కం బాబు, ఒబిలిశెట్టి నాగభూషణం, గవరసాని నాగేశ్వరరావు, బొజ్జా రెడ్డియ్య తదితరులున్నారు.

నిమజ్జనాలు భక్తిని చాటేలా ఉండాలి



పిఠాపురంలో వినాయక మంటప నిర్వాహకులకు సూచనలు ఇస్తున్న బీజేపీ నేతలు

పిఠాపురం: విఘ్నేశ్వరుడు చవితి ఉత్సవాల ముగింపు సందర్బంగా నిర్వహించే నిమజ్జనాలు భక్తిని చాటేలా ఉండాలే తప్ప అశ్లీలంగా ఉండకూడదని జిల్లా గణేష్ ఉత్సవ సమితి కన్వీనర్ ఎనిమిరెడ్డి మాల కొండయ్య గణేష్ మండపాల నిర్వాహకులకు సూచించారు. ఆయన ఆదివారం పిఠాపురం నియోజకవర్గంలో పిఠాపురం, గొల్లప్రోలు కొత్తపల్లి మండలాల్లో పర్యటించారు. హిందువులందరూ ఐక్యతగా ఉండి ఒకే స్థలంలో ఒకే రోజున సామూహికంగా నిమజ్జనాలు జరిగేలా చేయాలని మాల కొండయ్య అన్నారు. ఈ కార్యక్రమంలో బుర్రి మురళీధర్ రావు, దాట్ల వెంకట సూర్యనారాయణ రాజు, పసుపులేటి సత్యనారాయణ, అడబాల వీర మోహన్ రావు, ఆళ్ల సందీప్, పలువురు పెద్దలు పాల్గొన్నారు.

వివాహిత ఆత్మహత్య

పెద్దాపురం: కుటుంబ కలహాల నేపథ్యంలో వివాహిత ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఆదివారం సాయంత్రం పెద్దాపురం పట్టణంలో చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం వివరాలిలా ఉన్నాయి. స్థానిక లూథరన్ హైస్కూల్ సమీపంలో ఓ అపార్ట్‌మెంట్‌లో అద్దెకుంటున్న వేముల సురేఖ(35) కుటుంబ కలహాల నేపథ్యంలోఆత్మహత్యకు పాల్పడింది. భర్త సతీష్ గొదావరి గ్రామీణ బ్యాంక్ వేట్లపాలెం బ్రాంచిలో పని చేస్తున్నారన్నారు. ఏలూరుకు చెందిన ఆమెను వివాహమైనప్పటి నుంచి వారిద్దరి మధ్య ఉన్న మనస్పర్థల కారణఃగా పెద్దాపురంలో ఉంటున్న ఆమె ఆత్మహత్యకు పాల్పడిందని స్థానికులు చెబుతున్నారు. దీనిపై సీఐ క్రాంతికుమార్, ఎస్ఐ మౌనికలను వివరణ కోరగా ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన వాస్తవమని, దీనిపై విచారణ చేపట్టామన్నారు. మృతదేహాన్ని పెద్దాపురం ప్రభుత్వాసుపత్రికి పోస్టుమార్టమ్ నిమిత్తం తరలించారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్

కోటనందూరు: తాండవ నది నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను సీజ్ చేసినట్లు ఎస్సై టి.రామకృష్ణ ఆదివారం తెలిపారు. ట్రాక్టర్ డ్రైవర్‌ను అరెస్టు చేసి కేసు నమోదు చేశామన్నారు. ఎస్సై రామకృష్ణ మాట్లాడుతూ కోటనందూరు మండలంలో అనుమతులు లేకుండా ఇసుక, గ్రావెల్ తవ్వకాలు జరిపితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

పెద్దాపురం డీఎస్పీగా శ్రీహరిరాజు నియామకం

పెద్దాపురం: స్థానిక డీఎస్పీగా డి.శ్రీహరిరాజును నియమిస్తూ ఆదివారం ప్రభుత్వ ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా డీఎస్పీల బదిలీల్లో భాగంగా ఇప్పటి వరకు పెద్దాపురం డీఎస్పీగా పని చేస్తున్న లతాకుమారిని పోలీస్ హెడ్ క్వార్టర్స్‌కు బదిలీ చేస్తూ ఉత్తర్వులు అందాయి. ఏసీబీ డీఎస్పీగా పని చేస్తున్న శ్రీహరి రాజును ఇక్కడ డీఎస్పీగా నియమించారు. ఈ మేరకు పెద్దాపురం డీఎస్పీగా ఆయన బాధ్యతలు చేపట్టనున్నారు.

కరాటే పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



కరాటే పోటీల్లో ప్రశంసా పత్రాలను అందుకుంటున్న లంపకలోవ విద్యార్థులు

ప్రత్తిపాడు రూరల్: ఏలూరు సీఆర్ఆర్ ఇంజినీరింగ్ కళాశాల ఆవరణలో ఈ నెల 14, 15 తేదీల్లో జరిగిన నేషనల్ షోటోకాన్ కరాటే ఓపెన్ చాంపియన్‌షిప్ -2024 (బడేటి కప్) పోటీల్లో మండలంలోని లంపకలోవ కరాటే స్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. బాలికల విభాగంలో ఉత్తరకంచి ఆక్స్‌ఫర్డ్ స్కూల్‌కు చెందిన వై.కవిత, వై.అమృత, ప్రత్తిపాడు ప్రభుత్వ బాలికల వసతి గృహం విద్యార్థిని టీజేఎస్ఎం మానస ప్రథమ, ద్వితీయ స్థానాలను కై వసం చేసుకున్నారు. బాలుర విభాగంలో ఒమ్మంగి శ్రీభారతి విద్యానికేతన్ పాఠశాలకు చెందిన జె.సంజు, టి.సుశాంత్, మొదటి, రెండో స్థానాల్లో నిలిచారని కరాటే మాస్టర్ పి.బుజ్జి తెలిపారు. విజేతలకు కియో వైస్ ప్రెసిడెండ్ డాక్టర్ కేఎల్ఎం శాస్త్రి, రాష్ట్ర షోటోకాన్ కరాటే అసోసియేషన్ కార్యదర్శి నాగం శివ తదితరులు మెడల్స్, ప్రశంసాపత్రాలను అందజేశారు. విజేతలను ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, స్థానిక నాయకులు అభినందించారు.

దేవుడా..!



రాపర్తి దగ్గర గొర్రిఖండి కాలువ గట్టుపై ఉన్న దేవాలయం(ఫైల్)



రాపర్తి దగ్గర గొర్రిఖండి కాలువకు గండి పడడంతో కొట్టుకు పోయిన దేవాలయం

- గుడీ లేదు..గుడిలో దేవుడు లేడు
- వరద నీటిలో మాయమైన దేవాలయం

పిఠాపురం: అప్పటి వరకూ అక్కడే ఒక దేవాలయం ఉండేది చుట్టు పక్కల గ్రామాల వారు అక్కడికి వచ్చి పూజలు చేసుకునే వారు. కాని ఇప్పుడు చూస్తే అక్కడ గుడీ లేదు గుడిలో దేవుడూ లేడు. పిఠాపురం మండలం రాపర్తి గొర్రిఖండి కాలువ గట్టుపై ఒక దేవాలయం ఉండేది. అది ఏలేరు వరద వల్ల కాలువకు గండి పడడంతో దేవాలయంతో పాటు అక్కడి చెట్లు వరద ప్రవాహానికి కొట్టుకుపోయాయి.

ఎవరి బాధ వారిది..!



ఒక వైపు వరద తాకిడితో పాడైన పంట, మరో వైపు వరద నుంచి తప్పించుకున్న పంట పొలం

పిఠాపురం: ఏలేరు వరద కొందరి రైతులను విషాదంలోకి నెట్టేస్తే మరి కొందరు బతుకు జీవుడా అంటూ ఆనందం వ్యక్తం చేసే పరిస్థితులు నెలకొన్నాయి. పిఠాపురం మండలం రాపర్తి వద్ద ఏలేరు కాలువకు గండి పడి ఒక వైపు పొలాలు నీట మునిగి తుడిచిపెట్టుకు పోవడంతో ఆ రైతులు తీవ్ర విషాదంలో ఉన్నారు. మరో పక్క కాలువకు అటు వైపు ఉన్న కొన్ని పంట పొలాలు వరద తాకిడికి గురి కాకుండా తప్పించు కోవడంతో ఆ రైతులు ఊపిరి పీల్చుకున్నారు.

వికసించిన బ్రహ్మకమలం



పెద్దాపురంలో వికసించిన బ్రహ్మకమలం

పెద్దాపురం: హిమాలయ పర్వతాలతో పెరిగే బ్రహ్మకమలం పెద్దాపురం పట్టణంలో ఓ ఇంట్లో వికసించింది. స్థానిక కొత్తపేట రామాలయం వీధిలో ఆదిరెడ్డి విజయలక్ష్మి పూజా తులసీ కోటలో వేసిన బ్రహ్మకమలం మొక్కకు పూవ్వు పూసింది. ఈ బ్రహ్మకమలం పలువురిని అబ్బురపరుస్తోంది. ఏడాది ఒక్కసారి మాత్రమే పూసే ఈ కమలాన్ని చూడడానికి చుట్టపక్కల ప్రాంతాల ప్రజలు తరలివస్తున్నారు.